
పొంగి ప్రవహిస్తున్న ఓల్డ్ అయినాపురం డ్రెయిన్

● పూర్తికాని సార్వా కోతలు
పొంగి ప్రవహిస్తున్నడ్రెయిన్లు ● కొలిక్కిరాని దాళ్వా నారుమళ్లు

ఇలా అయితే.. దాళ్వా సాగేనా..?

అడుగడుగునా అడ్డంకులే..




ఇంకా ముంపులోనే ఉన్న గొరగనమూడి డ్రెయిన్ ఆయకట్టు పొలాలు

ఉప్పలగుప్తం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంకా సార్వా కోతలు పూర్తి కాలేదు. వాయుగుండాలు, తుఫాన్ల కారణంగా కోతలకు వాయిదాల పర్వం కొనసాగుతోంది. మరో వైపు దాళ్వా నాట్లకు సమయం మించిపోతోందని అధికారులే అంటున్నారు. నారుమళ్లు పోసుకునేందుకు కూడా వాతావరణం అవకాశం ఇవ్వడం లేదు. కొందరు నానా తిప్పలు పడి విత్తనాలు చల్లుకున్నా నారుమడుల పరిస్థితి దినదిన గండంగా ఉంది. మళ్లీ వర్షాల హెచ్చరికలతో కోతలు ఆగిపోయాయి. మరో వైపు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ఓల్డ్ అయినాపురం, గొరగనమూడి, రంగరాజుకోడు మీడియం డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహం అత్యంత తీవ్ర స్థాయిలో ఉంది. కూనవరం మేజర్ డ్రెయిన్ ద్వారా తగిన స్థాయిలో ముంపునీరు బయటకు పోనందున రైతులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ముంపు కారణంగా సార్వా పైరు పూర్తిగా ధ్వంసమైన పొలాలు ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి. ముంపునీరు దిగేదెప్పుడు? దాళ్వా నాట్లు వేసేదెప్పుడని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో దాళ్వా సాగు జరగాల్సి ఉంది. దీనికి కావలసిన నారుకు ఇంకా ఇరవై శాతంలో కూడా నారుమళ్లు సిద్ధం కాలేదు. డిసెంబరు నెలాఖరు లేదా జనవరి మొదటి వారంలో పూర్తి కావలసిన దాళ్వా నాట్లు ఈ ఏడాది ఎప్పటికి పడతాయి. ఇప్పుడు నారు పోసినా అన్నీ సక్రమంగా జరిగితే వచ్చే ఏడాది జనవరి నెలాఖరులో గాని దాళ్వా నాట్లు పూర్తయ్యే అవకాశం లేదు. దీనితో దాళ్వా సాగులో జాప్యం జరిగి చివరి దశలో చీడపీడలు, సాగునీటి కొరత ఏర్పడే ప్రమాదముందని రైతులు భయపడుతున్నారు. రైతులకు ఏటా కొండంత అండగా ఉంటున్న దాళ్వా సాగుకు ఆదిలోనే అంతరాయాలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లా పోలీసు అధికారులకు

ఏబీసీడీ అవార్డులు


రాష్ట్ర పోలీస్ ఏబీసీడీ అవార్డును జిల్లా ఎస్పీ కృష్ణారావుకు అందజేస్తున్న డీజీపీ ద్వారకాతిరుమలరావు

అమలాపురం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర దొంగల ముఠా కేసును విజయవంతంగా ఛేదించిన జిల్లాకు చెందిన పోలీసు అధికారులకు ఏపీ రాష్ట్ర పోలీసు ఏబీసీడీ అవార్డులను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు అందజేశారు. అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని క్రైమ్ నంబరు 181/2024లో నిందితులుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా కేసును ఇటీవల జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు నేతృత్వంలో ప్రత్యేక బృందం అరెస్టు చేసింది. నేర పరిశోధనకు, కేసుల సత్వర పరిష్కారానికి అధునాతన విధానాలను అవలంబిస్తూ వినూత్న మార్గాలను అనుసరించిన పోలీసు అధికారులను గుర్తించి వారికి అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్ (ఏబీసీడీ) అవార్డులను బుధవారం మంగళగిరిలోని డీజీపీ ప్రధాన కార్యాలయంలో అందజేశారు. కేసును ఛేదించిన ఎస్పీ కృష్ణారావుతో పాటు దర్యాప్తులో పాల్గొన్న అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, రూరల్ సీఐ పి.వీరబాబు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.ప్రశాంత్‌కుమార్, రూరల్ ఎస్ఐ వై.శేఖర్‌బాబు, సిబ్బందికి డీజీపీ ద్వారకాతిరుమలరావు అవార్డులు అందించి అభినందించారు.

గోదావరి పుష్కరాలు-2027కు

సన్నద్ధం కావాలి: మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు 2027కు అధికారులంతా సన్నద్ధం కావాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం రాజమండ్రి నగరపాలక సంస్థ, కొవ్వూరు డివిజన్ అధికారులతో మంత్రి నారాయణ, కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకట్రావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి, కమిషనర్ కేతన్‌గార్గ్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత లతో పుష్కరాల 2027పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా గతంలో ప్రతిపాదించిన పనులను ఫిబ్రవరి నెలలో తిరిగి ప్రారంభించనున్నట్టు చెప్పారు. 70 శాతం ఏడీబీ రుణం, మిగిలిన 30 శాతం ప్రభుత్వ గ్రాంటు విడుదల చేయడం జరుగుతుందన్నారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు అమృత్ పథకం 2.0 పథకం కింద రూ.8400 కోట్లు కేంద్రం గ్రాంటు ఉందని, ఇందులో కేంద్రం 36.70 శాతం గ్రాంటు ఇస్తున్నట్టు చెప్పారు. మిగిలిన నిధులను స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నిధులు అనుసంధానం చేయనున్నట్టు చెప్పారు.రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల పనులు రానున్న రెండేళ్లలో పూర్తిచేసి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోనసీమ సర్వతోముఖాభివృద్ధికి సహకారమందిస్తా..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు హామీ

జిల్లా సమీక్షా మండలి సమావేశంలో స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు

మంత్రి సుభాష్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు


సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

అమలాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలతో పరవశింపజేసే కోనసీమ జిల్లా అన్ని రంగాల్లోను సర్వతోముఖాభివృద్ధి సాధించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల గోదావరి భవన్‌లో బుధవారం సాయంత్రం జిల్లా సమీక్షా కమిటీ సమావేశాన్ని మంత్రి అచ్చెన్నాయుడు నిర్వహించారు. ప్రధానంగా ఈ సమీక్షలో ప్రాథమిక రంగ సెక్టార్, వాటి అనుబంధ రంగాలైన వ్యవసాయం, ఇరిగేషన్, పశుసంవర్థక డెయిరీ డెవలప్‌మెంట్, ఉద్యాన, మత్స్య విభాగాలతో పాటు ఉచిత ఇసుక పాలసీ, ధాన్యం కొనుగోలు, దీపం-2 పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై మంత్రి అచ్చెన్నాయుడు సుదీర్ఘంగా సమీక్షించారు. జిల్లా అన్నిరంగాల్లోను సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నూతన వరి వంగడాలు, హైబ్రిడ్ కొబ్బరి వంగడాలను అందించి వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా మార్చాలని, ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. విశాఖ, విజయవాడల్లో తలసరి ఆదాయం రూ.2 లక్షల 70 వేలు ఉంటే వ్యవసాయ ఆధారిత కోనసీమలో రూ.70 వేలు ఉందన్నారు. కోనసీమలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనకు ఎంఎస్ఎంఈ ద్వారా పారిశ్రామికవేత్తలను ఆశ్రయించి ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్‌లు రాజోలు, తూర్పుపాలెం వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన జిల్లాలో హార్బర్లు, జెట్టీలు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. టెంపుల్స్, బీచ్, పర్యాటక ప్రాంతాలను ఒక సర్క్యూట్‌గా చేసి అభివృద్ధి చేయడం వల్ల ఎందరికో ఉపాధి కలుగుతుందన్నారు. నరేగా నిధులతో డ్రైనేజీ, పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేపట్టేందుకు కృషి చేయాలని సూచించారు. ఆక్వా కల్చర్‌పై దృష్టి సారించి ఆ రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు నాన్ ఆక్వాజోన్‌లో నిబంధనలు కచ్చితంగా అమలుచేసి అక్రమ చెరువుల తవ్వకాలు నిరోధించాలని కలెక్టర్‌కు సూచించారు. వ్యవసాయానికి అనువుగా లేని చౌడు, వర్ర భూముల్లో మాత్రమే ఆక్వా సేద్యానికి అనుమతించాలని ఆదేశించారు. నూతన జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణాలకు ముందడుగు వేయాలని మంత్రి సూచించారు. పట్టణంలో రోడ్లు, విస్తరణ చేపడితే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిచ్చారు. అమలాపురం, రాయవరం రైతు బజార్లలో ఎస్టేట్ అధికారులను నియమించి పునఃప్రారంభించాలని ఆదేశించారు. వచ్చే రబీలో అధికారులు సూచించిన వంగడాలను రైతులు నాటాలని మంత్రి కోరారు. కోకోనట్ బోర్డు కార్యాలయాన్ని స్థానికంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని, తద్వారా కొబ్బరి అనుబంధ పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం అవుతుందన్నారు. పశుగ్రాసం కొరతను నివారిస్తామన్నారు. ఇరిగేషన్‌శాఖ డ్రెయిన్లు, కాల్వలు పనులపై దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫిబ్రవరి నెలలో ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ధాన్యాన్ని ఎన్డీయే ప్రభుత్వం కొనుగోలు చేసి 48 గంటల్లో రైతు ఖాతాకు డబ్బులు జమ చేయడం అత్యంత గర్వకారణమైన విషయమని, గత ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.1600 కోట్లను తమ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. జిల్లాలో ఉన్న 12 ఇసుక ర్యాంపుల ద్వారా ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలని సూచించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అడిగిన ఓ ప్రశ్నపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. పంచాయతీ కార్యదర్శుల నియామకాలు జీవో ప్రకారం చేపట్టింది లేనిదీ తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలో విభజన జరిగినప్పటికీ అధికారులు ఎక్కడో కాకినాడలో ఉండి ఈ జిల్లాలో విధులు నిర్వహిస్తే కుదరదన్నారు. దీనిపై కేబినేట్‌లో చర్చిస్తామని చెప్పారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లాలో ఇప్పటివరకు సాధించిన ప్రగతి నివేదికను ఇన్‌చార్జి మంత్రికి వివరించారు. 2047 డాక్యుమెంట్లను మంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, యిళ్ల వెంకటేశ్వరరావు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు డీఆర్సీ సమావేశంలో పాల్గొన్నారు. కాగా వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావుల మధ్య పలు అంశాలపై వాదోపవాదాలు జరిగినట్టు సమాచారం.

రాజ్యాంగంపై దాడి చేస్తున్న

మతోన్మాద ప్రభుత్వం

బహిరంగ సభలో వక్తలు

ముగిసిన సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు


ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

అమలాపురం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు అంబేడ్కర్ పేరును జపం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన పేరు ఎత్తకూడదని చెప్పడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ అన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఆమె ఖండించారు. మతోన్మాద బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై హత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. అత్యాచార నిరోధక చట్టాన్ని బీజేపీ నీరుగార్చిందన్నారు. సీపీఎం ఆవిర్భావం నుంచి కుల వివక్షపై పోరాడుతోందని చెప్పారు. సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు ముగింపు సందర్భంగా బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడడం దుర్మార్గమైన చర్య అన్నారు. అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగంపై, ప్రభుత్వ రంగ సంస్థలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) మాట్లాడుతూ జిల్లాలో లక్ష మందికి పైబడి కౌలు రైతులు ఉన్నా సగం మంది రైతులకు కూడా కౌలు రైతు కార్డులు మంజూరు చేయలేదన్నారు. వరుసగా వస్తున్న తుపాన్ల ప్రభావంతో ధాన్యంలో తేమ శాతం పెరిగి రైతులు నష్టానికి దళారులకు పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. టిడ్కో ఇళ్ల బకాయిలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే పార్టీ తరఫున ఆందోళనకు దిగుతామని కారెం వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

జిల్లా కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..

ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రథమ మహాసభల్లో తీర్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం జిల్లాశాఖ కన్వీనర్‌గా రెండోసారి కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులుగా కె.కృష్ణవేణి, డాక్టర్ చల్లా రవికుమార్, డీవీ రావు, గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, టి.నాగవరలక్ష్మి, ఎస్.జోగేష్, డీఏ లక్ష్మి ఎన్నికయ్యారు.

సంక్రాంతికి వచ్చేశాం..

ప్రత్యేక కథనం 6లో

హరిదాసుల సందడి మొదలు

రోడ్ల అభివృద్ధికి చర్యలు

కార్లలో ప్రయాణించే వారికి మాత్రమే టోల్ ఫీజు

అముడా ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న అచ్చెన్నాయుడు తదితరులు

అమలాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పూర్వపు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పీపీపీ విధానంలో రోడ్లు అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు చెప్పారు. కార్లపై ప్రయాణించే వారి నుంచి మాత్రమే టోల్ ఫీజు వసూలు చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన వాహనాలకు టోల్ ఫీజు ఉండదని స్పష్టం చేశారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సంబంధించిన ప్రతిపాదనలు క్రోడీకరించి సమర్పిస్తే వాటి మంజూరు కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కోనసీమ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించామన్నారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం మెట్ల రామలక్ష్మి కల్యాణ వేదికపై ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు కేటాయిస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముందస్తుగానే నామినేటెడ్ పదవుల భర్తీని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాష్ట్రంలో ఒక ఆదర్శవంతమైన జిల్లాగా కోనసీమను తీర్చిదిద్దేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ముందుగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ అముడా అభివృద్ధి విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ భూ ఆక్రమణలు వంటి ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ 42 ఏళ్లుగా టీడీపీలో కింగ్ మేకర్‌గా పనిచేస్తూ వచ్చిన స్వామినాయుడు పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి నేడు కింగ్‌గా ఎదిగారని ప్రశంసించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుకు పార్టీ సముచిత స్థానం కల్పించడం ఖాయమన్నారు. ముందుగా అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట ఎమ్మెల్యేలు ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అమలాపురం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, ఇరిగేషన్ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని కోరారు. సమావేశంలో కూటమి నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, మానేపల్లి అయ్యాజీవేమా, నామన రాంబాబు, బండారు శ్రీనివాస్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కల్వకొలను తాతాజీ మాట్లాడారు. అనంతరం అముడా ఛైర్మన్‌గా అల్లాడ స్వామినాయుడుచే జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, దంగేటి వెంకటరెడ్డినాయుడు (చిట్టిబాబు), పలచోళ్ల పద్మనాభం, కానూరి బాబ్జి, దాట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవ్‌ంగా ప్రారంభం

అమలాపురంలో 17వ బ్రాంచిని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలోని మెయిన్ రోడ్డులో 17వ వైభవ్ జ్యువెలరీ షోరూం ప్రారంభోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని వైభవ్ జ్యువెలరీ షోరూంను ప్రారంభించగా ఆ సంస్థ సీఎండీ గ్రంధి భారతీమల్లికార్జునకుమారి, హోల్‌టైమ్ డైరెక్టర్ గ్రంధి సాయి కీర్తన, సీవోవో జి.రాకల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, వైభవ్ జ్యువెలరీ ఏలూరు ఎండీ గ్రంధి అమరేంద్ర, బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, టీడీపీ నాయకుడు మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అల్లాడ శరత్ తదితరులు ఈ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా కోస్తాంధ్ర, తెలంగాణలో ఎంతో ప్రాధాన్యత కలిగిన వినియోగదారుల ఆదరాభిమానాలతో 17వ బ్రాంచిని అమలాపురంలో ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ నాణ్యత, అనువైన ధరలతో విభిన్న డిజైన్లలో వెండి, బంగారు, రత్నాలు, వజ్రాభరణాలను అందిస్తూ అమ్మకాల్లో వినియోగదారుల ఆమోదం పొందిన సంస్థగా వైభవ్ గుర్తింపు పొందిందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ బంగారు ఆభరణాలను ఇప్పుడు అమలాపురం పరిసర ప్రాంతాలకు అందుబాటులో ఉంచేందుకు వైభవ్ జ్యువెలరీ ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.రఘునాథ్ మాట్లాడుతూ వినియోగదారులకు అద్భుత శ్రేణి షాపింగ్ అనుభవంతో పాటు విస్తృత శ్రేణిలో 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్ వంటి వివిధ ఆభరణాలను ఇక్కడ నుంచి పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మన అమలాపురం గురించి తెలుసుకున్న కాంటెస్ట్ డ్రాలో పది మంది విజేతలకు ఒక గ్రాము గోల్డ్ కోయిన్స్‌ను సంస్థ ప్రతినిధులు అందజేశారు.


జ్యువెలరీ షోరూంలో వెండి కొబ్బరికాయలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ధనుర్మాసం వచ్చిందంటే చాలు సూర్యోదయానికి ముందే హరిలో రంగ హరి... అంటూ చేతిలో చిడతలు, తంబుర వాయిస్తూ తలపై అక్షయపాత్రతో ప్రత్యక్షమవుతారు హరిదాసులు. సంక్రాంతి నెలలో మనకు కనిపించే గొప్ప సంప్రదాయాల్లో ఒకటి హరిదాసుగానం. పూర్వం పల్లె, పట్టణం తేడాలేకుండా తెల్లవారుజామునే ముంగిట ముగ్గు లేసే సమయానికి పురవీధుల్లో కీర్తనలను ఆలపిస్తూ అలరించేవారు. భక్తిగీతాలను అలా పాడుకుంటూ సాగిపోవడం... ఎవరైనా ధన, ధాన్యాలను స్వయంపాకంగా ఇస్తే స్వీకరించడం వారి సంప్రదాయం.... హరిదాసుపై ప్రత్యేక కథనం...





సంక్రాంతికి వచ్చేశాం..

పల్లెలు, పట్టణాల్లో మొదలైన హరిదాసుల సందడి

(ఆంధ్రజ్యోతి, తుని రూరల్/అంబాజీపేట)

హరిదాసు అంటే..

హరిదాసు అనగా పరమాత్మతో సమానం. మనుషులు ఇచ్చే దానధర్మాలు అందుకుని వారికి ఆయురారోగ్యాలు, భోగ భాగ్యాలు కలగాలని దీవించేవారే హరిదాసులు. నెలరోజులపాటు హరినామాన్ని గానం చేసినందుకు చివరి రోజున ఇచ్చే ధన, ధాన్యాలను, వస్త్ర దానాలను స్వీకరిస్తారు. వీరి వస్త్రధారణ ప్రత్యేకంగా ఉంటుంది. పట్టు ధోవతి కట్టి, పట్టు కండువా నడుమ చుట్టి మెడలో ఒక పూల హారం ధరించి చక్కగా తిలకం దిద్దుకుంటారు. సూర్యభగవానుడు ప్రసాదించిన అక్షయ పాత్రగా శిరస్సుపై పంచలోహ పాత్ర ధరిస్తారు. తెల్లవారకముందే ఈ అలంకరణ పూర్తి చేస్తారు. గోదాదేవిని స్మరించి తిరుప్పావై పఠించి విధుల్లోకి వెళ్తారు. తిరిగి ఇంటికి వెళ్లే వరకు హరినామ సంకీర్తన తప్ప ఏ ఇతర విషయాలూ మాట్లాడరు. తలపై అక్షయ పాత్రను కిందకు దించరు. ఇల్లు చేరిన తర్వాత ఆ ఇంటి ఇల్లాలు హరిదాసు పాదాలను కడిగి అక్షయ పాత్రను దించుతుంది. అలా ధనుర్మాసం అంతా ఎంతో నిష్ఠగా ఉంటారు హరిదాసులు.



శ్రీమహావిష్ణువుకు ప్రతిరూపాలుగా భావించే హరిదాసులు ధనుర్మాసంలో తెలుగు లోగిళ్లలో సందడి చేస్తారు. వీరు ధనుర్మాస అతిథులుగా పండగకు నెలరోజులు ముందు నెల గంట పట్టాక ధనుర్మాస ప్రవేశంతోనే ప్రజలకు వీరి దర్శనం కలుగుతుంది. తంబూర మీటుతూ, చితడలు వాయిస్తూ రామనామ సంకీర్తనలతో వినసొంపైన బాణీలతో అలరిస్తారు. హరిదాసులు అంటే పెద్దలకు భక్తిభావం, పిల్లలకు మాత్రం వారిని చూడడంలో సరదా ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెలరోజులపాటు పొద్దున్నే వీరి పిలుపుతోనే పల్లెలు నిద్రలేస్తాయి.

పద్ధతి ఎలా వచ్చింది...

శ్రీరాముడి రాజ్యంలో చింతలు లేవు. కరువు కాటకాలు రావు. దానధర్మాలు చేద్దామన్నా పుచ్చుకునేవారే కరువయ్యారని ప్రజలు ధర్మదేవతను ఆడిపోసుకునేవారట. అది విన్న వేగులు రాముడితో చెప్పగా వారి దానధర్మాలను పుచ్చుకునేందుకు హరినామాన్ని గానం చేసే గాయకులను రాజ్యంలో తిరుగాడేలా చేశారని, వారే నేడు కన్పించే హరిదాసులని చెబుతుంటారు.

హరిదాసుల రామగానం..

ఏడాది అంతా వేర్వేరు పనుల్లో నిమగ్నమయ్యే హరిదాసులు ధనుర్మాసంలో మాత్రం తప్పకుండా రామగానం చేస్తారు. సొంత ఊళ్ల నుంచి వేరే ఊళ్లకు వెళ్తారు. గ్రామవీధుల్లో భజనలు చేస్తారు. ప్రతిఇంటి ముందు కూర్చుని లేవడం కష్టమైనా భక్తిభావంతో అదంతా మర్చిపోతారు. వంశపారంపర్యంగా అనేకమంది దశాబ్దాలుగా రామనామ స్మరణ చేస్తున్నారు. సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత తమ సొంత ఊళ్లకు వెళ్లే హరిదాసులు మిగతా రోజులు పొలం పనులు, కూలి పనులతో జీవనం సాగిస్తారు.

సంప్రదాయాన్ని కొనసాగించేందుకే...

శ్రీరామావతారంగా భావించి ఈ దీక్షను స్వీకరిస్తాం. ఉదయం 4 గంటల నుంచే పొగమంచులో ప్రయాణం ప్రారంభిస్తాం. చివరి రోజు స్వయంపాకంలో వందలు, వేల రూపాయలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆదరణ బాగా తగ్గిపోయింది. దానం ఇచ్చే వారు తగ్గిపోయారు. ఏటా భద్రచలం వెళ్లి శ్రీరాముడికి రూ.2వేలు సమర్పించుకుంటా. భావితరాల వారు ఈ కళలోకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలన్నదే మా తాపత్రయం.


–సత్యనారాయణ, హరిదాసు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

పాపాలు తొలగుతాయని..

సంక్రాంతికి ముందు అంటే ధనుర్మాసంలో హరిదాసులు వీధుల్లో కనువిందు చేస్తూ శ్రీమద్రామణ రమణ.. గోవిందో హరి అంటూ ఇంటి ముందు ముగ్గుల చుట్టూ ఒకసారి తిరుగుతారు. హరిదాసును వేకువజామునే దర్శిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఉట్టిచేతులతో ఆయన్ను పంపరు. అందుకే తుంబుర గానం వినిపించగానే గృహిణులు స్వయం పాకాలతో సిద్ధంగా ఉంటారు.

హైటెక్ హరిదాసులు

ధనుర్మాసం ప్రారంభమైన నెలరోజులపాటు హరిదాసులు వేకువజామునే గ్రామాల్లో ఇంటింటికీ నడుచుకుని తిరిగి సందడి చేసేవారు. ప్రస్తుత ఆధునిక కాలంలో అప్పటి హరిదాసులకు వయస్సు పెరగడంతోపాటు కీళ్లనొప్పులు తదితర రోగాల బారిన పడడంతో మోటార్‌సైకిల్‌పై ఇంటింటికీ వచ్చి బియ్యాన్ని స్వీకరిస్తున్నారు. ఆ మోటార్‌సైకిల్‌కు అక్షయపాత్రను ప్రత్యేకంగా అలకరించి మైక్‌లో హరిరామ సంకీర్తనను రికార్డింగ్ చేయించి ఇంటింటికీ వెళ్తుండగా భక్తులు కృష్ణార్పణం అంటూ అక్షయపాత్రలో బియ్యాన్ని పోస్తున్నారు. సంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా నూటికి పది మంది హరిదాసులు కాలినడకనే నెత్తిపై అక్షయపాత్ర ధరించి ఇంటింటికీ తిరుగుతున్నారు.



శీతాకాలంలో జరభద్రం

- వ్యాధులు విజృంభించే సీజన్
- జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పు
- ఉన్ని దుస్తులు తప్పనిసరి
- గుండె, శ్వాస, రక్తపోటు రోగులు జాగ్రత్త
- ఎండవచ్చిన తర్వాతే వ్యాయామం చేయాలంటున్న వైద్యనిపుణులు

కోటనందూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో చలిప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. గజగజ వణికిస్తోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ఉదయం 10గంటలవరకు ఎండరావడం లేదు. రోజంతా చలిగా ఉంటోంది. చలి తీవ్రతకు చిన్నారుల నుంచి వృద్ధులు, గుండె, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఈ చలికాలంలో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. దీంతో ఈ కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఎదురయ్యే సమస్యలు..

చలికాలంలో ప్రధానంగా జలుబు, గొంతు నొప్పులతో చిన్నారులు, వృద్ధులు సమస్యలతో బాధపడుతుంటారు. వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. పెదవులు పగిలి రక్తస్రావం జరుగుతుంది. చర్మం పొడిబారుతుంది. దీని వల్ల దురద ఎక్కువగా ఉంటుంది. 50ఏళ్లు పైబడినవారిలో కీళ్లనొప్పులు ఎక్కువగా ఉంటాయి. చల్ల నీళ్లతో స్నానాలు చేయడం, మంచులో ప్రయాణం చేయడం వల్ల పంటి సమస్యలతోపాటు, అస్తమా రోగులు శ్వాస తీసుకోవడం, జలుబు వంటివి తరచూ వస్తాయి. గుండె, రక్తపోటు ఉన్నవారు కూడా తీవ్ర ఇబ్బందులు పడతారని అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

శీతాకాలం మంచులో తడవడం, చల్ల గాల్లో తిరగడం చేయకూడదు. చిన్నపిల్లలను చలిగాలుల్లో ఆడుకోనివ్వరాదు. మంకీ టోపీలు, గ్లౌజులు, మాస్కులు వంటివి ధరించాలి. ఒకే చోట ఎక్కువ సమయం కూర్చొని ఉండకుండా చలి,మంచు తగలకుండా ఇంట్లోనే నడవాలి. జలుబు ఎక్కువగా ఉంటే ఆవిరి పట్టాలి. గొంతు సమస్య ఉన్నవారు ఒక గ్లాసు వేడినీటిలో చెంచా ఉప్పు వేసుకుని పుక్కిలించాలి. ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతి రుమాలను తరుచూ మారుస్తూ ఉండాలి. చిన్నపిల్లలకు ముక్కు మూసుకుపోయి శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటే నాసికా రంధ్రాల్లో నాజల్ డ్రాప్స్ గానీ, ఉప్పు నీటి చుక్కలు గానీ వేయాలి. వేడి నీళ్లు తాగాలి. నిల్వ పదార్థాలను తినరాదు. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. పెదవులు పగిలిపోకుండా గ్లిజరిన్ కలిగిన లిప్ బామ్‌లను గానీ వెన్న, కొబ్బరి నూనె రాసుకోవాలి. రాత్రి సమయంలో రాసుకుంటే మంచిది. వాకింగ్ చేసేవారు విధిగా గ్లౌజులు, మాస్కులు, ఉన్ని దుస్తులు వేసుకోవాలి. అస్తమా ఉన్నవారు చల్లగాలులకు పూర్తిగా దూరంగా ఉండాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఉన్ని దుస్తులు ధరించి ప్రయాణం చేయాలి. అన్ని జాగ్రత్తలు తీసుకుంటేనే ఈ శీతాకాలంలో ఇబ్బందులనుంచి గట్టెక్కగలమని వైద్య నిపుణులు చెప్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



శీతాకాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చిన్నపిల్లల్లో అస్తమా ఉంటే ఇబ్బందులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏడాదిలోపు శిశువులకు ఉదయం పూట స్నానం చేయించడంవల్ల ముక్కు బ్లాక్ అయి ఇబ్బందులు పడొచ్చు. ఎండ వచ్చిన తర్వాత చర్యలు చేపట్టాలి. గుండె, చక్కెరవ్యాధి, ఆస్తమా ఉన్నవారు తగుజాగ్రత్తలు తీసుకోవాలి.

డాక్టర్ రెడ్డి త్రినాథ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, తుని ఏరియా ఆస్పత్రి

గర్భిణిలు జాగ్రత్తగా ఉండాలి



శీతాకాలంలో గర్భిణులు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలి. ఉదయంపూట ఎండలో ఉండాలి. గదుల్లో వెచ్చదనం ఉండేలా చూసుకోవాలి. ఉన్నిదుస్తులతోపాటు ముఖానికి గాలి తగలకుండా చూసుకోవాలి.

అలమండ ప్రసన్న, గైనకాలజిస్టు



తుని-నర్సీపట్నం రహదారిపై మంచు కురుస్తున్న దృశ్యం



పాపికొండలు పర్యాటకంలో

నిబంధనలకు తూట్లు

సమయపాలన పాటించని బోట్ల యజమానులు

దేవీపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను చూడ్డానికి ఎప్పుడెళ్దామా అని ప్రకృతి ప్రేమికులంతా ఎదురు చూస్తుంటారు. గోదావరిలో బోటు షికారు చేస్తూ కొండలు, అడవులను చూస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణం చేయడం మరపురాని అనుభూతి. అయితే నిబంధనలను పట్టించుకోకపోతే ఆనందం మాట పక్కన పెడితే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. ప్రస్తుతం పాపికొండలు విహారయాత్రకు వెళ్లే బోట్ల యజమానులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా గోదావరి నదిలో పర్యాటకానికి వెళ్లే బోట్ల రాకపోకల విషయంలో పర్యాటకుల భద్రత దృష్ట్యా నిబంధనలు కఠినతరం చేశారు. పాపికొండలు పర్యాటకానికి వెళ్లే బోటు విధిగా ఉదయం 8.40 గంటలకు బోటు పాయింట్ నుంచి బయల్దేరి సాయంత్రం ఐదు గంటలలోపు తిరిగి గమ్యానికి చేరాలనే నిబంధన ఉంది. మంగళవారం బోటు పాయింటు నుంచి ఉదయం రెండు బోట్లు బయల్దేరి వెళ్లాయి. తెలంగాణ నుంచి సుమారు 60 మంది నిర్దిష్ట సమయం ముగిశాక రావడంతో అనుమతి కోసం వేచి చూశారు. ఎట్టకేలకు ఉదయం 11.30 గంటలకు బోటు పాపికొండలు బయలుదేరింది. సాధారణంగా ఉదయం ఏడు గంటలకు వెళ్లిన బోటు సాయంత్రం రావడానికి 6 లేదా 7 అవుతుంది. అలాంటిది అధికారులు సూచించిన నిర్దిష్ట సమయంలో బోటు వెళ్లకపోవడం, ఆలస్యంగా వెళ్లడాన్ని పలువురు విమర్శించారు. పర్యాటక బోట్లు రాకపోకలు పర్యవేక్షించే పోశమ్మగండి చెక్‌పోస్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పాపికొండలు విహార యాత్రలో బోట్ల యజమానులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాణిజ్య పంటలకు నిలయంగా.. కాట్రావులపల్లి



జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో మిరప పంట



కాట్రావులపల్లిలో బంతి తోటలో పూలు కోస్తున్న దృశ్యం

- నల్లరేగడి నేలలు అధికం
- మొక్కజొన్న, పచ్చిమిర్చి, శనగలు, కాయగూర పంటల పెంపకం
- సీజనల్‌గా పూలతోటలు, కొత్తిమీర

జగ్గంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటల్లో కాట్రావులపల్లి ముందంజలో ఉంది. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని ఈగ్రామంలో రైతులు అధికసంఖ్యలో ఉంటారు. వీరంతా భూములను కౌలుకు తీసుకుని పంటలు పండించడంలో దిట్ట. ఈ ప్రాంతంలో నల్లరేగడి నేలలు అధికంగా ఉండడంతో మొక్కజొన్న, స్వీట్‌కార్న్‌లతోపాటు ఎండుమిర్చి, పచ్చిమిర్చి, శనగలు, మినుములు, కాయగూర పంటలు, సీజనల్‌గా పూల తోటలు, కొత్తిమీర... ఇలా అన్ని రకాలూ పండిస్తున్నారు. వాటిని మార్కెట్లో అమ్మి వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడులను తెచ్చుకోవడంతోపాటు జీవనభృతి పెంచుకోవడంలో ఇక్కడి రైతులు ముందుంటున్నారు. స్వీట్‌కార్న్ సాగులో వీరికి వీరే సాటి. మూడు నెలల్లో పంటలు చేతికొచ్చేలా వ్యవసాయం చేయడంలో ఆరితేరారు. జగ్గంపేట-కాకినాడ ప్రధాన రహదారికి ఇరువైపులా నిత్యం ఏదో ఒక పంట ఎగుమతి అవుతూనే ఉంటుంది. ప్రస్తుతం ఆకుకూరలు, కొత్తి మీర, పూల తోటలు వేసి రైతులు లాభాల బాటలో వున్నారు. కొత్తమీర పంటకు ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి పెడితే రూ.20వేలు ఆదాయం వస్తుందని, రెండు నెలల కాలంలో పంట చేతికి అందుతుందని రైతులు చెప్పారు.

ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా

ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

వివాదాలుంటే రెవెన్యూ సదస్సుల్లో సరి చేసుకోవాలి: వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని దేవదాయ శాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన అన్నవరం దేవస్థానం ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా భూములపై చర్చించారు. దేవాలయాల భూముల లీజు విషయంలో అశ్రద్ధ వహించొద్దని, ఆలయ భూముల రికార్డుల విషయంలో తప్పొప్పులు ఉంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని సరిచేసుకోవాలన్నారు. అన్నవరం దేవస్థానం భూములు ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. సత్యగిరి కొండలు 466.34 ఎకరాలు, చెందుర్తిలో 150.50 ఎకరాల కొండ, 66.64 ఎకరాల్లో మారేడువనం పెంపకం, వివిధ ప్రాంతాల్లో లీజుల పరిధిలో 71.84 ఎకరాలు, ఆలయ పరిధిలో ఉద్యానవనాలు, ఇతర నిర్మాణాలు 36.94 ఎకరాలు... దేవస్థానం పరిధిలో మొత్తం సుమారు 800 ఎకరాలున్నాయని, ఇందులో 4.75 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయని ఈవో వివరించారు. అనంతరం సిబ్బందికి కమిషనరు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాలు, సత్రం గదుల వద్ద పారిశుధ్యం మెరుగ్గా ఉంచాలని, సిబ్బంది విధిగా డ్రెస్‌కోడ్ పాటించాలని, వ్రతమండపాల్లో పురోహితులు దానాల పేరుతో డబ్బులు వసూలు చేయకుండా ఆడియో రికార్డు, ఫ్లెక్సీల ద్వారా భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి అదనపు కమిషనరు చంద్రకుమార్, రీజనల్ జాయింట్ కమిషనర్లు ఆజాద్, భ్రమరాంబ, అన్నవరం దేవస్థానం నుంచి ఉప కమిషనరు చంద్రశేఖర్, సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావు, పీఆర్వో కొండలరావు, ఈఈలు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సకాలంలో తెరవని కేశఖండనశాల

బుకింగ్ కౌంటర్

తాళాలు పగులకొట్టించిన అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

గుమస్తా సస్పెన్షన్.. కాంట్రాక్ట్ ఉద్యోగి విధుల నుంచి తాత్కాలికంగా తొలగింపు

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు కొరడా ఝుళిపిస్తున్నారు. బుధవారం ఉదయం ఆరు గంటలు దాటినా కేశఖండనశాల బుకింగ్ కౌంటర్ తెరవకపోవడంతో భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆకస్మిక తనిఖీ చేసిన ఈవో వెంటనే బుకింగ్ కౌంటర్ తాళాలు పగులగొట్టించి తెరిపించారు. మరొకరిని నియమించి ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారులకు సమాచారమివ్వకపోవడంతో కేశఖండనశాల గుమస్తా యడ్ల బుల్లబ్బాయిని సస్పెండ్ చేశారు. సకాలంలో రాని కాంట్రాక్ట్ ఉద్యోగిని ఆర్.మల్లేశ్వరిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి భక్తులకు అసౌకర్యం కల్పిస్తే ఎంతటివారైనా చర్యలకు వెనుకాడబోనని సుబ్బారావు పేర్కొన్నారు.

దుర్గామాత దర్శనానికి పాదయాత్రగా...


రాజానగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం నర్సాపురానికి చెందిన 11 మంది భవానీ మాలధారణ దీక్షతో విజయవాడ దుర్గామాత దర్శనం కోసం ఈ నెల 13న కాలినడకన పయనమయ్యారు. మార్గమధ్యంలో బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం తూర్పుగోనగూడెం చేరారు. విజయవాడ సుమారు 400 కిలోమీటర్లు దూరం ఉంటుందని, భక్తులు ఎవరైనా భిక్ష ఏర్పాటు చేస్తే స్వీకరిస్తున్నామని చెప్పారు. భవానీ మాలలు ధరించడం ఇది 11వ పర్యాయమని, విజయవాడకు తొలిసారిగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. ఇంద్రకీలాద్రిపై ఈ నెల 21వ తేదీన చండీ హోమం ప్రారంభం అవుతుందని, 22 నాటికి తాము విజయవాడ చేరుకుంటామని భవానీ మాలధారులు చెప్పారు.



పాదయాత్రగా తూర్పుగోనగూడెం చేరుకున్న భవానీ భక్తులు

పాలన.. గాడినపడేనా?

- అన్నవరం దేవస్థానంలో ఈవోలు మారినా పాలన అస్తవ్యస్తం
- ఆదాయం వస్తున్నా అనవసర వ్యయాలతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం
- మార్పులకు శ్రీకారం చుట్టిన నూతన ఈవో సుబ్బారావు


అన్నవరం సత్యదేవుడి ఆలయం

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గత కొంతకాలంగా అస్తవ్యస్తంగా మారిన పాలన నూతన ఈవో రాకతో గాడిన పడుతుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వైసీపీ హయాంలో సుమారు రూ.6కోట్లు అనవసర వ్యయమయింది. అనంతరం గతేడాది కార్తీకమాసంలో రామచంద్ర మోహన్ బాధ్యతలు స్వీకరించినా ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు ఉండడంతో వారంలో రెండురోజులు మాత్రమే అన్నవరం విచ్చేసి మిగిలినరోజులు ఈ ఫైలింగ్, చరవాణిలా ద్వారా పాలనను నడిపించారు. అనంతరం ఆయనను దేవదాయశాఖ ప్రధాన కార్యాలయానికి పరిమితం చేసి అన్నవరం దేవస్థానం ఈవోగా సింహాచలం ఈవోగా ఉన్న వేంద్ర త్రినాథరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనపై కూడా రెండు ప్రధానాలయాల బారం పడడంతో పూర్తిస్థాయి దృష్టిసారించే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న వీర్ల సుబ్బారావు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఈనెల 14న బాధ్యతలు స్వీకరించారు. అయితే సుబ్బారావు కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టారు. గత 4 రోజులుగా ఆయన ప్రతీ విభాగాన్ని క్షేత్రస్థాయిలోకి వెళ్లి అధ్యయనం చేస్తూ ఆయా విభాగాల పనితీరుపై అవగాహన కల్పించుకుంటూ పాలన సాగిస్తున్నారు. ముందుగా ఆయన తీసుకున్న నిర్ణయం అప్పటివరకు ప్రతి ఫైలు గుమాస్తా వద్ద నుంచి ఏఈవోకు చేరుకున్న తరువాత నేరుగా ఈవోకు చేరేది. అయితే ఈ విధానం తప్పని గ్రహించి పారదర్శకత కోసం సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌కు చేరిన తరువాతే తన వద్దకు పంపాలని ఆదేశించారు. దీంతో కొన్ని వర్గాలకు ఈ విధానం మింగుడుపడకపోవడంతో పాలన గాడినపడుతున్నట్టేనని చర్చించుకుంటున్నారు. ముందుగా ఆలయంలో విభాగాలు ఎన్ని ఉన్నాయి, వాటి నిర్వహణ తీరు ఏవిధంగా ఉంది తెలుసుకుని నేరుగా ఆయా విభాగ కార్యాలయానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. మరికొన్ని విభాగాలకు సంబంధిత విభాగ ఏఈవో, సూపరెంటెండెంట్‌ను కార్యాలయానికి పిలిపించి మాట్లాడడం చేస్తుండడంతో కిందిస్థాయి ఉద్యోగుల్లో గుబులు ప్రాంభమైంది. మరో 15 రోజులు గడిస్తే పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకుని పాలన పరుగులు పెట్టించేవిధంగా అడుగులు పడతాయని భావిస్తున్నారు. అయితే రాజకీయనేతలు పాలనా వ్యవహారాల్లో వేలు పెట్టనంతవరకు సవ్యంగానే నడుస్తుందని లేకుంటే యథావిధిగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నవిదంగా తయారవుతుందనడంలో సందేహం లేదు.

ఆందోళనకరంగా ఆర్థిక పరిస్థితి...

ప్రధానంగా అన్నవరం ఆలయంలో ఆర్థిక పరిస్థితి ఆందోళన కలిగిస్తుంది. గత అధికారులు ఇష్టారీతిన అనవసర వ్యయం చేయడం వాటికి నేడు చెల్లింపులు చేపట్టడంతో బడ్జెట్ మించిపోయింది. దీంతో మిగిలిన నాలుగు నెలలు ఏవిధంగా నెట్టుకురావాలో అర్థంకాని ప్రశ్న. దీనికి సంబంధించి సప్లమెంటరీ బడ్జెట్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం ఆలయంలో గత 3 దశాబ్దాలుగా ఏటా స్వామివారి పేరున మిగులు నిధులు డిపాజిట్ చేసేవారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా డిపాజిట్లను విత్‌డ్రాయల్ చేయకుండా చూశారు. ఈ ఏడాది మాత్రం సుమారు రూ.5 కోట్లు వరకు డిపాజిట్లను క్యాన్సిల్ చేయడంతో అన్నవరం ఆలయ ఆర్థిక పరిస్థితి ఏవిధంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వచ్చే ఏడాది మార్చి వరకు అనవసర ఖర్చులు తగ్గించి ఆదాయ మార్గాలు పక్కకు వెళ్లకుండా దేవస్థానం ఖజానాకు చేరితే ఆర్థిక పరిస్థితి కొంత మెరుగవ్వచ్చు. ఏది ఏమైనా ఏడాది కాలానికి డిప్యుటేషన్‌పై వచ్చిన నూతన ఈవో సుబ్బారావు సవాళ్లతో కూడిన పాలన చేయాల్సి వస్తుంది. ఆయనకు సత్యదేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆశిద్దాం.

కోట సత్తెమ్మ కరుణించమ్మా...

వైభవంగా బోనాల సమర్పణ


బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్తున్న మహిళలు

నిడదవోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్న అమ్మ కోటసత్తెమ్మతల్లి అందరిని కరుణించమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున బోనాలు నెత్తిన పెట్టుకుని అమ్మవారికి చీర, సారె పసుపు కుంకుమలతో తరలివచ్చారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజు పాలెంలో మేళ తాళాలతో అంగరంగ వైభవంగా కోట సత్తెమ్మకు బుధవారం చీర సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్తెమ్మ తిరునాళ్లలో నాల్గోరోజైన బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన అఖిలభారత తెలుగు సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో 101 మంది మహిళలతో అమ్మవారికి చీర, సారె, పసుపుకుంకుమలు సమర్పించారు. రాజమహేంద్రవరం నుంచి బోనాలతో తరలివచ్చిన మహిళల నుదేవస్థానం సహాయ కమిషనర్ బి.హరి సూర్య ప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, సూపరిండెంట్ జల్లా సోమరాజు ఆహ్వానించారు. మహిళలు బోనాలు సమర్పించారు.. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు అప్పారావుశర్మ, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ అమ్మవారు

ఒత్తిడి అధిగమించేందుకు క్రీడలు దోహదం

» ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక » ముగిసిన యాన్యువల్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ » విజేతలకు బహుమతుల అందజేత

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమని, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక అన్నారు. కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ముగింపు వేడుకలు బుధవారం ఉత్సాహంగా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా బహుమతి ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉత్తేజం లభిస్తా యన్నారు. నిత్యం వ్యాయామం తప్పనిసరని, పోలీసులు ఫిట్‌నెస్‌తో ఉంటే మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చన్నారు. ఏటా యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడంతో ఆరోగ్యంగా, పూర్తి ఫిట్‌గా పోలీసులు ఉంటారన్నారు. 1500 మీటర్లు, 100 మీటర్లు పరుగు పందెం ఫైనల్ పోటీ జరిగింది. స్కావెంజర్స్‌కి స్నాక్ రేస్, బ్యాంకు సిబ్బందికి, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగింది. పలుపోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు పంపి ణీ చేశారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో కాకినాడ జిల్లా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కమాండెంట్ దీపికలు హుషారుగా పాల్గొని తమ జట్టు సభ్యులతో కలసి తాడు లాగి క్రీడాస్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసు సిబ్బంది ఆర్కెస్ట్రాలు ఆకట్టుకున్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా క్యాంప్ ఫైర్ వెలిగించారు. ట్రైనీ డీఎస్పీ సృజన, అదనపు కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐ తదితర అధికారులు పాల్గొన్నారు.


టగ్ ఆఫ్ వార్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న కమాండెంట్ దీపిక వెర్సస్ కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బృందం

కాకినాడ ఎంపీకి భారత్ గౌరవ్ అవార్డు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. చిన్న వయసు ఎంపీగా, కాకినాడ జిల్లా అభివృద్ధిపై తనదైన మార్క్ చూపిస్తున్న ఆయనకు ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న తొలి ఎంపీగా చరిత్ర సృష్టించగా తాజాగా ప్రతిష్టాత్మక భారత్ గౌరవ్ అవార్డును అందుకున్నారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నుంచి ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

జేఎన్టీయూకే ఖోఖో టోర్నమెంట్‌లో
విజేతగా ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు

కాకినాడ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు విజ్ఞాన్ నీరుల మహిళల ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16,17న జరిగిన జేఎన్టీయూకే కాకినాడ సెంట్రల్ జోన్ మహిళల ఖోఖో టోర్నమెంట్‌లో కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు విజేతగా నిలిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. జేఎన్టీయూకే విశ్వవిద్యాలయ పరిధిలోని 13 కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా ఐడియల్ జట్టు ఫైనల్లో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుందన్నారు. ఈ జట్టులోని సీఎస్ఈ మొదటి సంవత్సర విద్యార్థిని ఐశ్వర్య, ఈసీఈ మొదటి సంవత్సర విద్యార్థిని మౌనిక కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఖోఖో పోటీల్లో జేఎన్టీయూకే తరపున ఆడేందుకు ఎంపికయ్యారని తెలిపారు. వారిని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ఏవో వర్మ, శ్రీహరి వర్మ అభినందించారు.



మహిళల ఖోఖో టోర్నమెంట్ విజేత జట్టుతో డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఏవో

పలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం పలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహనాయక్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మసిస్టులు మూడు పోస్టులు, పోస్ట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక పోస్టు, లాస్ట్ గ్రేట్ సర్వీసెస్ ఎల్‌జిఎస్ 2 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. కావున అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నందు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలన్నారు. దరఖాస్తు దారులకు సంబంధించిన నోటిఫికేషన్, అప్లికేషన్ ప్రొఫార్మా NIC http://eastgodavari.ap.gov.in, http://kakinada.ap.gov.in, http://konaseema.ap.gov.in వెబ్సైట్‌నందు పొందపరిచామని చెప్పారు.

21, 22న ఐలాజ్ జాతీయ మహాసభలు

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రెండో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐలాజ్ ప్రతినిధులు కోరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఐలాజ్ జాతీయ మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కటక్‌లోని కళా వికాస కేంద్రంలో జరిగే మహాసభలకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిక్ ఏకే పట్నాయక్, జస్టిక్ కె.చంద్రు హాజరై 'న్యాయ వ్యవస్థ, స్వతంత్ర' అంశంపై ప్రసంగిస్తారని ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగతా శివ, కోశాధికారి అవసరాల దేవి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు ఆర్వీ వెంకట్రావు, కార్యదర్శి బొంగులూరు మధుబాబు, మాజీ అధ్యక్షుడు చిట్టింశెట్టి పుల్లయ్య, సీనియర్ న్యాయవాదులు వినరసింహారావు, పలివెల నాగేంద్రరాజు, సోము గౌరీశంకర్, అశోక్‌కుమార్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐలాజ్ ప్రతినిధులు

ముగ్గురి హత్య కేసులో...
వేట్లపాలెంలో 12 మంది అరెస్ట్

- అరెస్టయిన వారిలో ముగ్గురు మహిళలు
- మారణాయుధాలు, ఆటో స్వాధీనం
- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

సామర్లకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో ఇంటి నిర్మాణంలో 2 కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదంలో ఒక కుటుంబంపై మరొక కుటుంబం కత్తులు వంటి మారణాయుధాలతో ఆదివారం రాత్రి దాడులకు పాల్పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులను హత్య చేసి మరో ఏడుగురిని గాయపరిచిన 12 మంది వ్యక్తులను బుధవారం సాయంత్రం సామర్లకోటలో అరెస్ట్ చేసినట్టు సామర్లకోటలో బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడించారు. వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు దళితచెరువు వద్ద కార్థాల పండు అనే వ్యక్తి ఇంటినిర్మాణంలో భాగంగా శ్లాబ్ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బచ్చల మోషే, బచ్చల జకరయ్య, బచ్చల బిల్లప్ప అనే బుల్లప్పి, బచ్చల దొరయ్య, బచ్చల రాము, బచ్చల రాజ్‌కుమార్, బచ్చల చంద్రరావు, గుల్ల సన్నీ, శీకోటి రాజేంద్రప్రసాద్, బచ్చల గోపీ, బచ్చల గవరయ్య, బచ్చల రాజు, గుడాల సునీల్, బచ్చల సూర్యాకాంతం, బచ్చల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి మరికొందరు వ్యక్తులతో కలిసి తొలుత ఇంటి నిర్మాణదారుడితో ఘర్షణలకు సిద్ధపడ్డారు. ముందుగా అనుకున్న వ్యూహం మేరకు తమ వెంట తెచ్చుకున్న కత్తులతో కార్థాల కుటుంబాలకు చెందిన వ్యక్తులపై దాడులకు దిగి నరకడంతో ముగ్గురు మృతి చెందారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పోలీసులు అరెస్టు చేసినవారిలో బచ్చల జకరయ్య, బచ్చల మోషే, బచ్చల బిల్లప్పన్న అనే బుల్పప్పి, బచ్చల దొరయ్య అనే దొరబాబు, బచ్చల రాము, బచ్చల గోపీ, బచ్చల గవరయ్య అనే చంటి, బచ్చల రాజు, బచ్చల సూర్యాకాంతం, బచ్చల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నయ్యలు ఉన్నారు. హత్యకు ఉపయోగించిన 5 మారణాయుధాలు, 3 కర్రలతో పాటు దాడులకు వినియోగించిన ఆటో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. రెండు కుటుంబాల మధ్య ఆధిపత్య పోరే ముగ్గురి హత్యలకు దారి తీసిందని డీఎస్పీ చెప్పారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అడ్మిన్ ఎస్పీ సూచనలతో పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో సామర్లకోట సీఐ, పెద్దాపురం క్రైం సీఐ తదితర ఎస్ఐలతో కలిసి వేట్లపాలెం జీవీకె విద్యుదుత్పత్తి కేంద్రం రోడ్డులో నిందితులను అరెస్ట్ చేశారు. ఇదే కేసులో మరికొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని, కేసు దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుందని డీఎస్పీ శ్రీహరి రాజు చెప్పారు. కాగా 12 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు పేర్కొన్నప్పటికీ విలేకరుల సమావేశంలో అరెస్ట్ చేసినవారినెవ్వరినీ పాత్రికేయుల సమావేశంలో హాజరుపర్చకపోవడం గమనార్హం.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు

రూ.20 లక్షలకు రూ.20 కోట్లు వస్తాయని...

రైస్ పుల్లింగ్ పేరుతో మోసం చేసిన ఏడుగురి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సర్పవరం సీఐ పెద్దిరాజు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్ పేరుతో ఓ వ్యక్తిని మోసం చేసిన ఏడుగురు నిందితులను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన పెనుమత్స నాగరాజు కాంట్రాక్ట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుమారు ఏడాది కింద అరకు వెళ్లాడు. అక్కడ నాగరాజుకి ఏఎస్ఆర్ జిల్లా పిట్ట దుమ్ముగూడెం మండలం పాడి గ్రామానికి చెందిన పిట్ట గుండన్న, చింతపల్లి మండలం కోతపల్లికి చెందిన గోపీనాయక్, చిన్నలగూడకు చెందిన కిల్లో శ్యాంసన్, కడసిల్పికి చెందిన పొంగి దోహన్ రావు, అరకు వ్యాలీ చిన్నలాబుడకు చెందిన గోపి నాయక్ తిరుపతిరావు, కరబలయ్య సుజాత, సెట్టి బుల్లెమ్మలతో పరిచయం ఏర్పడింది. తమ వద్ద కోట్లు విలువ చేసే రైస్ పుల్లింగ్ కాయిన్ ఉందని, దీనిని విక్రయిస్తే అధిక డబ్బులు సంపాదించవచ్చని, పెట్టుబడి పెట్టాలని నాగరాజుని కోరారు. ఓ కాయిన్‌ని చూపించి ఆశ కల్పించారు. రూ.20లక్షలు పెట్టుబడి పెడితే రూ.20 కోట్లు వస్తాయని నమ్మించారు. వారి మాటలను నమ్మిన నాగరాజు స్నేహితులతో కలిసి నిందితుల అకౌంట్‌లోకి పలు దఫాలుగా రూ.20 లక్షలు పంపాడు. మంగళవారం నిందితులు నాగరాజుకి ఫోన్ చేసి రైస్ పుల్లింగ్ కాయిన్ తీసుకువస్తున్నామని, డబ్బులు సిద్ధంగా ఉంచుకోమని చెప్పారు. డబ్బులు తీసుకుని వెళ్లగా రాగి కాయిన్ ఇచ్చారు. అది పరిశీలిస్తే సీతారామ పట్టాభిషేకం బొమ్మతో ఉంది. మోసపోయినట్టు గుర్తించిన నాగరాజు వారిని ప్రశ్నించాడు. దాంతో నిందితులు చాకు చూపించి రూ.50 వేలు తీసుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు సురేష్‌నగర్ పార్కు వద్ద ఉండగా అరెస్ట్ చేసి రూ.50 వేలు, చాకు, రాగి కాయిన్‌ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పలువురు నుంచి రైస్‌పుల్లింగ్ కాయిన్ పేరు చెప్పి మోసంచేసి ఉంటారని తెలిపారు.

14 కాసుల బంగారం, రూ.90వేలు నగదు చోరీ

ఆలస్యంగా వెలుగులోకి

జగ్గంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో కొద్ది రోజుల క్రితం జరిగిన 14 కాసుల బంగారం, రూ.90వేలు నగదు చోరీ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 14న రాత్రి రామవరంలోని రేవాడ బుజ్జిబాబు ఇంటిలో చోరీ జరిగింది. బుజ్జిబాబు భార్యపిల్లలతో రాజమహేంద్రవరంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రామవరంలో బుజ్జిబాబు ఇంటిలో తన అత్తగారు భీమవరపు సాయమ్మ(60) నివాసముంటోంది. 14న ఇంటి దగ్గరలోనే ఉంటున్న బంధువుల ఇంటికి సాయమ్మ వెళ్లి రాత్రికి అక్కడే ఉండి పోయిందని, తెల్లవారుజామున వచ్చి చూసే సరికి ఇంటితాళాలు పగలకొట్టి ఉన్నాయని బుజ్జిబాబు తెలిపాడు. అటకమీద డబ్బాలో పెట్టిన 14కాసుల బంగారం, బీరువాలో పెట్టిన రూ.90వేలు నగదు చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్ఐ రఘునాథరావు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేశారు.

రాజమహేంద్రవరంలో బంగారం చోరీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లింగంపేటలో ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు వస్తువులు అపహరించుకుపోయారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. లింగంపేటకు చెందిన వెంకటనారాయణ ఈ నెల 12న కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తీసి ఉండడం స్థానికులు చూసి వెంకటరమణకు ఫోను చేసి చెప్పారు. దీంతో అతడు బయలుదేరి బుధవారం నగరానికి చేరుకుని ఇంటికి వెళ్లి చూస్తే తలుపుల తాళాలు పగులకొట్టి ఉన్నాయి. లోపల బీరువాలో పెట్టిన 11గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

జగ్గంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో యువతకు గంజాయి సరఫరా చేస్తున్నారని జగ్గంపేట పోలీసులకు సమాచారం అందడంతో సీఐ వైఆర్కే శ్రీనివాసరావు గంజాయి పొట్లాలు అమ్ముతున్న వారిపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేట నెహ్రూ కాలనీకి చెందిన 20ఏళ్ల సునీల్, రామవరం గ్రామానికి చెందిన 19ఏళ్ల సుధీర్ జగ్గంపేటలో యువతకు గంజాయి సరఫరా చేస్తున్నారని సమాచారం సీఐ వైఆర్కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునందనరావుకు అందింది. దీంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద 2.6 కిలోల గంజాయి దొరికింది. కేసు నమోదు చేసి ఇద్దరిని పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు వారికి 14రోజులు రిమాండ్ విధించడంతో పెద్దాపురం సబ్‌జైలుకు తరలించారు. దాడుల్లో హెచ్ సీ రమణ, నాగరాజు, ఏఎస్ఐ కుమార్ తదితరులున్నారు.

రాజమహేంద్రవరం కార్పొరేషన్
డీఎస్‌వోపై బ్లేడుతో దాడి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ జనన-మరణ విభాగంలో డీఎస్‌వోగా పని చేస్తున్న డి.రవికుమార్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రవికుమార్ మంగళవారం రాత్రి ఆంధ్రానగర్‌లో తన ఇంటి వద్ద బైక్‌ను పార్క్ చేస్తుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి రవికుమార్ పీకపై బ్లేడుతో దాడి చేసి పరారయ్యాడు. దీంతో కంఠం పైభాగంలో గాయమైంది. రవికుమార్‌ను కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

అధ్వానంగా లూటుకుర్రు కాల్వగట్టు రోడ్డు

- రోడ్డు వేయాలంటూ స్థానికుల నిరసన
- పట్టించుకోని అధికారులు, నాయకులు


రోడ్డు వేయాలంటూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మామిడికుదురు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లూటుకుర్రు ఎన్టీఆర్ కాలనీ నుంచి ఆర్డబ్ల్యుఎస్ వాటర్ ట్యాంకు వరకు రోడ్డు అధ్వానంగా తయారైందని దానిని వేయాలంటూ స్థానికులు బుధవారం నిరసన తెలిపారు. సుమారు కిలో మీటరున్నర మేర రోడ్డు అధ్వానంగా తయారై మంగళవారం కురిసిన వర్షాలకు బురదమయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆర్‌డబ్ల్యుఎస్ తాగునీటి పైపులైను నిమిత్తం రోడ్డుకు ఒకపక్క తవ్వారని, ఆ మట్టి రోడ్డుపై చేరి మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి బురదమయంగా అయిందన్నారు. రాళ్లు లేచి ప్రమాదకరంగా తయారవ్వడంతో వాహనదారులు పడిపోయి గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్ధ కాలం క్రితం నిర్మించిన రోడ్డు అధ్వానంగా మారినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ రహదారిని ఆధునీకీకరించి ప్రజలను కష్టాల నుంచి గట్టెక్కించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడలి రామకృష్ణ, బొంతు రాంబాబు, చప్పిడి పాండురంగారావు, కడలి ఈశ్వర్, బొంతు చంద్రావతి, జాలెం సరోజిని, బొంతు శ్రీను, త్రిమూర్తులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణను విజయవంతం చేయండి


శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు

ముమ్మిడివరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ఉద్దేశించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు సూచించారు. జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుల డీఆర్పీల రిఫైన్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబరులో జిల్లా వ్యాప్తంగా 132 మంది డీఆర్పీలకు శిక్షణ ఇస్తామన్నారు. డీఆర్పీలకు రీ ఓరియంటేషన్ ట్రైనింగ్‌ను గురువారం నుంచి మూడురోజులపాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ఆధ్వర్యంలో మూడురోజుల శిక్షణ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ట్రైనింగ్ సెంటర్‌ను ట్రైనింగ్ ప్రోగ్రాం కోర్సు కోఆర్డినేటర్ బి.రమణశ్రీ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావుతో కలిసి ఆయన ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. ట్రైనింగ్ సెంటర్‌లో మౌళిక సదుపాయాలను, ట్రైనింగ్ ప్రోగ్రాంకు అవసరమైన సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. జిల్లాలో ప్రతీ మండలం నుంచి ఎంపిక చేసిన ముగ్గురు ఉపాధ్యాయులు, గతంలో శిక్షణ పొందిన ముగ్గురు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన

రావులపాలెం, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ పాఠశాలలో ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్.రాజబాబు మాట్లాడుతూ విద్యుత్ పొదుపు చేయడంవల్ల భవిష్యత్ తరాలకు విద్యుత్‌ను అందిస్తామన్నారు. స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలు వినియోగించడంవల్ల కలిగే విద్యుత్ ఆదా సోలార్ విద్యుత్‌వల్ల కలిగే లాభాలపై విద్యార్థులకు వివరించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు

- డీఈవో షేక్ సలీంబాషా


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీంబాషా హెచ్చరించారు. ముమ్మిడివరం మండలంలో బుధవారం పర్యటించిన ఆయన రాణేలంక ఏపీ సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల, రాణేలంక జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వసతిగృహంలో విద్యార్థుల సంక్షేమానికి వసతిగృహ సంక్షేమ అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతిగృహంలో అపరిశుభ్ర పరిస్థితులపట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అపరిశుభ్రత వాతావరణంలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు తయారు చేయడం, అదే వాతావరణంలో విద్యార్థులు భోజనం చేస్తుండడాన్ని ఆయన గుర్తించి సంబంధిత సిబ్బందిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులవల్ల విద్యార్థులు అనారోగ్యానికి దారి తీస్తాయని ఆయన ప్రిన్సిపాల్‌కు సూచించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అవసరమైతే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈవో విద్యార్థులతో కొంతసేపు గడిపి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవో సలీంబాషా లంకాఫ్ రాణేలంక జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల నోట్స్, వర్కు పుస్తకాలను పరిశీలించారు. సిలబస్ ప్రకారం బోధన సాగుతుందా లేదా అనే దానిపై ఆయన ఆరా తీశారు. పాఠశాల హెచ్ఎం పర్యవేక్షణ సంతృప్తికరంగా లేకపోవడాన్ని ఆయన గమనించి తగిన సూచనలు చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మోరి మాజీ సర్పంచ్ మృతి


జాన సత్యనారాయణవిజయలక్ష్మీ

మలికిపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మోరి గ్రామ మాజీ సర్పంచ్ జాన సత్యనారాయణ విజయలక్ష్మి(71) మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆమె 2001 నుంచి 2006 వరకు మోరి సర్పంచ్‌గా పనిచేశారు. విజయలక్ష్మి భర్త జాన శంకరరావు మోరి సర్పంచ్‌గాను, చేనేత సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. విజయలక్ష్మికి ముగ్గురు కుమారులు. ఒక కుమారుడు జాన వీరభద్రప్రసాద్ వైద్యుడిగా సేవలందిస్తున్నారు. విజయలక్ష్మి భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

'కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'


డిప్యూటీ తహశీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న దళిత చైతన్యవేదిక నాయకులు

రాజోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత చైతన్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. రాజోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట దళిత చైతన్యవేదిక నాయకులు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బుధవారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, లిఖితపూడి బుజ్జి మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు భారత రాజ్యాంగం, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పైనా గౌరవం లేదన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంపై ప్రమాణంచేసి హోంమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అమిత్‌షా అంబేడ్కర్‌ను విస్మరించడం మూర్ఖత్వానికి పరాకాష్ట అన్నారు. అమిత్‌షా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి క్షమాపణ చెప్పకపోతే దేశ వ్యాప్తంగా జరిగే ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మట్టా సురేష్‌కుమార్, చిలకపాటి శ్రీధర్, జిల్లెల్ల వినోద్, మెడబల శేఖర్, బత్తుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

'తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి'

ముమ్మిడివరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాపై తీవ్రంగా ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచనల మేరకు మత్స్యకారులు గోదావరిలో చేపల వేటకు వెళ్లరాదని, వ్యవసాయ రైతులు వరికోతలను ప్రస్తుతం వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కోతలు కోసిన వరి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి భద్రపరుచుకోవాలన్నారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయశాఖ సిబ్బందితో సంప్రదించి రైతులు తగు సూచనలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకి రాకూడదని రెవెన్యూ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జడ్పీ చైర్మన్ పరామర్శ

మామిడికుదురు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోదర వియోగంతో బాధపడుతున్న పాశర్లపూడి గ్రామానికి చెందిన తోరం భాస్కర్‌ను జడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం పరామర్శించారు. భాస్కర్ సోదరుడు తోరం రామచంద్రరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో భాస్కర్‌ను పరామర్శించి మృతిచెందిన ఆయన సోదరుడి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. జడ్పీచైర్మన్ వెంట ఎంపీటీసీలు నెల్లి దుర్గాప్రసాద్, చిక్కం బుజ్జిబాబు, పిల్లి శ్రీనివాస్, అడ్డగళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్


రాజోలు: శివకోటిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శివకోడు గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద డీఎల్పీవో పి.బొజ్జిరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజోలు తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ భూ బదలాయింపులు కాకుండా ప్రతీఒక్కరూ భూములను విక్రయించినా, ఇతర కారణాలతో బదలాయింపు చేసినా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ నక్కా రామారావు, సెక్రటరీ సూర్యప్రకాశరావు, డిప్యూటీ తహశీల్దార్ సీఎస్ రాజు, వీఆర్వో కె.మాధవరావు, దేవదాయశాఖ అధికారి రాజు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

మలికిపురం: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కటి వేదికలని తహశీల్దార్ టి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మలికిపురం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలు రెవెన్యూ సమస్యలపై ప్రసంగించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, తులసీభాస్కర్, సుభాకర్, హరికృష్ణ, అచ్యుత్ పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రభుత్వం భూసమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి అన్నారు. మాచవరం-2 సచివాలయ కార్యాలయంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా 6 అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు తెలిపారు. 33 రోజుల్లో భూసమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నాయకులు గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ, దొమ్మేటి రామారావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, ఆర్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కొక్క గ్రూపునకు 25లక్షలు పెంచుతాం

- డ్వాక్రా మహిళల సమావేశంలో మల్లాడి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి, హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాస్

యానాం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రస్తుతం ఇచ్చే పది లక్షల డ్వాక్రా రుణాలను రానున్న రోజుల్లో ఒక్కొక్క గ్రూపుకి 25లక్షలు పెంచేలా తాను బాధ్యత తీసుకుంటానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్ మున్సిపల్ కల్యాణమండపంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పరిపాలనాధికారి మునిస్వామి, పుదుచ్చేరి అర్బన్ డవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ సీఎంగా సమయంలో అక్కడ నడుస్తున్న ఈ పావలావడ్డీ పథకంను పుదుచ్చేరిలోని యానాంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. అప్పటినుంచి యానాంలోనే కాకుండా పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా ఈపథకం అమలుచేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కొక్కరికీ లక్షచొప్పున గ్రూపు మొత్తానికి రూ.10లక్షలు వరకు మున్సిపాలిటీ ద్వారా బ్యాంకులు రుణాలను అందిస్తున్నారు. రానున్న రోజుల్లో ఒక్కొక్కరికీ రెండు లక్షల యా భైవేలు చొప్పున మొత్తం గ్రూపుకు రూ.25లక్షలు ఇచ్చేలా తాను బాధ్యత తీసుకుంటానని అన్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే గొల్లపల్లి, ఆర్ఏ మునిస్వామి, పుదుచ్చేరి నుంచి వచ్చిన అధికారులు మాట్లాడారు. అనంతరం యానాంలో 85 గ్రూపులకు చెందిన సభ్యులకు రుణాల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యానాంలోని వివిధ శాఖలకు చెందిన బ్యాంకు అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

22 నుంచి అఖండ కాలభైరవ హోమం


విద్యుత్‌నగర్‌లో డాగ్‌స్టార్ పతాక ధ్వజానికి పూజలు నిర్వహిస్తున్న నరేంద్రకుమార్

అమలాపురంటౌన్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కాలభైరవాష్టమిని పురస్కరించుకుని ఈనెల 22నుంచి అఖండ కాలభైరవ హోమం నిర్వహిస్తున్నట్టు సలాది వెంకటసాయిరామ్ తెలిపారు. విద్యుత్‌నగర్‌లోని ఆదిశేషా నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో రెండురోజులపాటు తంత్రోక్త అఖండ కాలభైరవ హోమం జరుగుతుంది. 23వ తేదీ రాత్రి 9 గంటలకు మహాపూర్ణాహుతితో హోమం ముగుస్తుందని తెలిపారు. 3890 కొబ్బరికాయలు, వందలాది గుమ్మడికాయలు, పరిమళ సుగంధ ద్రవ్యాలతో ధూమ్ర వారాహి సమిత శ్రీకాలభైరవ అఖండ హోమాన్ని రవణం నరేంద్రకుమార్-నాగకృష్ణవేణి దంపతులు కర్తలుగా నిర్వహిస్తామన్నారు. కాలభైరవాష్టమిని పురస్కరించుకుని అఖండ హోమ ప్రాంగణంలో పతాక ధ్వజాన్ని బుధవారం అక్షయపాత్ర సభ్యులు పోతరాజు రామకృష్ణ-నాగకనకదుర్గ, నూకల ప్రసాద్-కుమారి, గొవ్వాల అచ్యుతరామయ్య, ఏసు ఆవిష్కరించారు.

మాజీ ఎమ్మెల్యే రక్షహరికృష్ణకు ఘన నివాళి

యానాం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బడుగు, బలహీనవర్గాల నేత రక్ష హరికృష్ణ వర్ధంతి సందర్భంగా అధికారులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఫెర్రిరోడ్డులో గల ఆయన విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, ఎన్ఆర్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ తదితరులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యానాం సమాచారశాఖ అధికారి కెఎల్‌వీ ప్రసాద్, యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమసేవా సంఘ అధ్యక్షుడు శేరు కృష్ణా, హంసాని రామలక్ష్మణుడు, రక్ష కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


హరికృష్ణ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు, నాయకులు

రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ


రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న సహచర క్రీడాకారులు

అమలాపురం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో జరిగిన 44వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో అమలాపురం క్రీడాకారులు ముగ్గురు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించారు. పోటీల్లో గాదిరాజు గంగరాజు 60 ఏళ్ల పైబడిన విభాగంలో 800 మీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానం సాధించి స్వర్ణ పతకం దక్కించుకోగా కాండ్రేగుల గోపాలకృష్ణ 65 ఏళ్ల పైబడిన విభాగం 5 కిలోమీటర్ల నడక పోటీల్లో తృతీయస్థానం సాధించి కాంస్య పతకం, 55 ఏళ్ల పైబడిన విభాగంలో కొప్పిశెట్టి వెంకట్రావు రన్నింగ్ విభాగంలో ప్రథమస్థానం సాధించి స్వర్ణ పతకం దక్కించుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, కుడుపూడి త్రినాథరావు, చప్పిడి శోభన్‌బాబు, ఉండ్రు ప్రసాద్, ముక్కామల చక్రధర్, గొవ్వాల రాజా, ఎంఎంకెజీ మొయినుద్దీన్ తదితరులు అభినందించి సత్కరించారు.

ఇన్‌చార్జి మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ముమ్మిడివరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు దృష్టికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు నియోజకవర్గ సమస్యలు తీసుకువెళ్లారు. అమలాపురంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చిబాబు నియోజకవర్గంలో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఇరిగేషన్, డ్రైనేజీ, మైన్స్ వ్యవసాయశాఖ, ఎన్ఆర్ఈజీఎస్, వివిధ సమస్యలను ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుచ్చిబాబు వారిని కోరారు.

నంది విగ్రహం ప్రారంభం

ద్రాక్షారామ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరంలో నిర్మించిన నంది విగ్రహాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రారంభించారు.విగ్రహం ఆవిష్కరించి పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, గ్రామస్థులుపాల్గొన్నారు.


నంది విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

సీఎం సహాయనిధి సాయం పంపిణీ


సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న దేవ

మలికిపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎందరికో మేలు జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను దేవ అందజేశారు. నియోజకవర్గంలో వైద్యపరంగా ఇబ్బందుల్లో ఉన్న వారందరికీ సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, రావూరి నాగు, గుబ్బల ఫణి, చాగంటి స్వామి, గుబ్బల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగతనంపై ఫిర్యాదు

మామిడికుదురు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో గుర్తు తెలియని వ్యక్తులు తనను వెంబండించి సెల్‌ఫోన్‌ను దొంగిలించారని పాలూరి పాండురంగారావు నగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను మోపెడ్ మోటారుసైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి చక్రం వెనక్కు తిరుగుతుందని చెప్పడంతో తాను మోపెడ్‌ను ఆపి చక్రం వైపుచూస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు చాకచక్యంగా తన జేబులోని సెల్‌ఫోన్‌ను లాక్కొన్నారని తెలిపారు. జేబులో బరువు తక్కువవడంతో సెల్‌ఫోన్ పోయిందని గ్రహించి వారిని వెంబడించగా మోటారుసైకిల్‌పై వేగంగా పాశర్లపూడివైపు వెళ్లిపోయారని పేర్కొన్నారు. దీనిపై నగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు.

విశ్వవిద్యాలయాల పోటీలకు క్రీడాకారుల ఎంపిక

రాజోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల కిక్ బాక్సింగ్ పురుషుల, మహిళల విభాగాల్లో పోటీలను రెండోరోజు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలకు నన్నయ యూనివర్సిటీ అబ్జర్వర్‌గా డాక్టర్ బి.రామగోపాల్, మెంబర్లుగా డాక్టర్ బాపిరెడ్డి, సీహెచ్ సతీష్ వ్యవహరించారు. రిఫరీగా, జడ్జిలుగా అంజనీకుమార్, గిరిబాబు, భవానీశంకర్ ఉన్నారు. ఈ పోటీలకు 12 కళాశాలల నుంచి సుమారు 55 మంది క్రీడల్లో పాల్గొన్నారు. 16 మంది క్రీడాకారులు విశ్వవిద్యాలయాల పోటీలకు ఎన్నికయ్యారని ప్రిన్సిపాల్ సాయిబాబు తెలిపారు. ఈ పోటీల్లో మహిళల్లో ఓవర్ ఆల్ టీమ్స్ చాంపియన్ షిప్ రాజమహేంద్రవరం ఎస్కేవీటీ డిగ్రీ మహిళా కళాశాల, పురుషుల విభాగంలో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కైవసం చేసుకున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సాయిబాబు అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. విశ్వవిద్యాలయాల పోటీలకు ఎన్నికైన క్రీడాకారులను అభినందించారు. కోఆర్డినేటర్ ఎస్.రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.మధుకుమార్, రిటైర్డ్ ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బోస్, అశ్వనీరెడ్డి పాల్గొన్నారు.


రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

సర్పంచ్‌లు, సచివాలయం సిబ్బంది శిక్షణా కార్యక్రమాల్లో అధికారులు


పి.గన్నవరం: శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ప్రసాద్


అల్లవరం మండల పరిషత్ వద్ద సర్పంచ్‌లతో అధికారులు

పి.గన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, సచివాలయం సిబ్బంది కి ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజు ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ముఖ్యంగా విద్య, వైద్యం, తాగునీరు, అంగన్‌వాడీలు, అభి వృద్ధి తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం అంశాలు వారీగా సంబంధిత అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జి.ఉమామహేశ్వరావు, ఎంఈవో కె.హెలీనా, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

అంతర్వేది: సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఎస్‌డీజీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశాలపై రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం జరిగింది. సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులకు అధికారులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎఫ్‌సీ కె.సూర్యనారాయణ, సెక్రటరీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

అల్లవరం: గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రగతిలో సర్పంచ్‌లు, కార్యదర్శులు భాగస్వామ్యులు కావాలని ఎంపీడీవో బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంవద్ద సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈవోపీఆర్డీ నాగేంద్ర, పీఆర్ ఏఈ సయ్యద్ ఫకీర్, సర్పంచ్‌లు సాధనాల వెంకట్రావు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, వడ్డి సుభాషిణి, బొమ్ము బాలవేణి, కడలి గంగాచలం, విజయలక్ష్మి, సీతారత్నంపాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలు సాధించడమే ధ్యేయం

రాజోలు: సుస్థిరమైన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించడమే ధ్యేయమని రాజోలు ఎంపీడీవో డి.రాంబాబు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల్లో ఆర్జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక-2025-26 సుస్థిరమైన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా సర్పంచ్‌లకు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఎం.సత్యనారాయణ, సర్పంచ్‌లు రేవు జ్యోతి, సెక్రటరీలు రజనీ, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


రాజోలులో సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, అధికారుల

తడి-పొడి చెత్తను వేరుచేసి అందించాలి


చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న వీరన్న

అమలాపురంటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ ఇంటి నుంచి సేకరిస్తున్న చెత్తను తడి-పొడిగా వేర్వేరుగా మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందజేయాలని శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి బండి వీరన్న గృహిణిలకు అవగాహన కల్పించారు. అమలాపురం 6వ వార్డులోని రాజీవ్ వీధిలో మహిళలకు అవగాహన కల్పిస్తూ తడిచెత్తను ఆకుపచ్చ డబ్బాలోను, పొడిచెత్తను నీలం రంగు డబ్బాలోను, హానికరమైన చెత్తను ఎరుపురంగు డబ్బాలోను ఉంచి మున్సిపల్ వర్కర్ల ద్వారా వాహనాలకు అందజేయాలని వివరించారు. అరిగెల చిన్ని, స్థానిక మహిళలు, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

భక్తులతో వాడపల్లి ఆలయం కిటకిట



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న మాజీ మంత్రి యనమల, ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం బుధవారం కిటకిటలాడింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,06,935 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

మాజీ మంత్రి యనమల పూజలు: శ్రీ వేంకటేశ్వరస్వామిని బుధవారం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఆల య అధికారులు ఆయనకు స్వామివారి చిత్రపటం అందించారు. ఆయన వెంట ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన చెల్లూరు వైసీపీ వార్డు మెంబర్లు

టీడీపీలోకి చెల్లూరు వార్డు మెంబర్లు

రాయవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామానికి చెందిన నలుగురు వార్డు మెంబర్లు బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో 4వ వార్డు మెంబరు లంకలపల్లి సూర్యకుమారి, 7వ వార్డు దొండపాటి మేరి కమల, 10వ వార్డు బి.సత్యనారాయణ, 15వ వార్డు కురుపూడి లీలాదేవి టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఇటీవల జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్న కురుపూడి రాజును ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ సర్పంచ్ మోరంపూడి రాజ్‌కుమార్, కొప్పిశెట్టి సతనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



శిక్షణలో మాట్లాడుతున్న బ్రహ్మానందం

కె.గంగవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా సమన్వయకర్త పీవీ బ్రహ్మానందం అన్నారు. వెలుగు మండల కేంద్రంలో పంచాయతీ సర్పంచ్‌లకు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ బుధవారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ కోటి లక్ష్మీ నరసమ్మ, ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో జరిగిన శిక్షణలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ముగిసిన ప్రజా ప్రతినిధుల శిక్షణ

ఆలమూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరులో ప్రజా ప్రతినిధులు, అధికారులకు జరిపిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఐక్యరాజ్య సమితి రూపొందించిన అంశాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన అంశాలపై శిక్షణ ఇచ్చామని ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం తదితర పలు అంశాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇతర అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు.



కపిలేశ్వరపురంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి

కపిలేశ్వరపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతిఒక్కరు సాంకేతిక నైపుణ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని డీపీఆర్‌సీ కి చెందిన భీమేశ్వరి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ ఆర్. మోహన్‌లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండవరోజు బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్ఎస్‌డీజీ సుస్థిరమైన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండలపరిషత్ కార్యాలయ ఏవో రాజేంద్రప్రసాద్, మండల ఇంజనీరింగ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మండపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న ఆరుగురికి మంజూరైన రూ.3,21,278, చెక్కులను బుధవారం టీడీపీ కార్యాలయంలో బాధితులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌ల చేతుల మీదుగా అందించారు. సీఎం సహాయ నిధి నుంచి వైద్య సేవల కోసం ఆర్థికసాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శెట్టిబలిజ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, చుండ్రు వెంకట్రావు, పిల్లా తాతీలు, గుణ్ణం సాయిబాబా, బొక్కా రామకృష్ణ, పెనుమత్స వెంకటవర్మరాజు, గొడవర్తి సత్యనారాయణ, జి.సూర్య ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగతనంపై ఫిర్యాదు

మామిడికుదురు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో గుర్తు తెలియని వ్యక్తులు తనను వెంబండించి సెల్‌ఫోన్‌ను దొంగిలించారని పాలూరి పాండురంగారావు నగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను మోపెడ్ మోటారుసైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి ఇద్దరు వ్యక్తులు మోటారుసైకిల్‌పై వచ్చి చక్రం వెనక్కు తిరుగుతుందని చెప్పడంతో తాను మోపెడ్‌ను ఆపి చక్రం వైపుచూస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు చాకచక్యంగా తన జేబులోని సెల్‌ఫోన్‌ను లాక్కొన్నారని తెలిపారు. జేబులో బరువు తక్కువవడంతో సెల్‌ఫోన్ పోయిందని గ్రహించి వారిని వెంబడించగా మోటారుసైకిల్‌పై వేగంగా పాశర్లపూడివైపు వెళ్లిపోయారని పేర్కొన్నారు. దీనిపై నగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు.

నేడు మినీ జాబ్‌మేళా

మండపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.టీ.టీవి శ్రీనివాసరావు చెప్పారు. మరింత సమాచారం కోసం వినోద్ 80991 83854, రాజేంద్ర 82476 45389 మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసి మరింత సమాచారం పొందవచ్చన్నారు.

సాగునీటి ఎద్దడి నివారణకు రైతుల శ్రీకారం

- స్వచ్ఛందంగా నడుం బిగించిన గుమ్మిలేరు అన్నదాతలు
- మురుగునీటి కాలువకు అడ్డుకట్ట వేసిన వైనం

ఆలమూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దాళ్వా వరిసాగులో రైతులకు సాగునీటి కోసం పలు ఇబ్బందులు తలెత్తుతాయి. వీటిని ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టడంలో గుమ్మిలేరు రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. పంట భూముల నుంచి మురుగునీటి కాలువలోకి వృధాగా పోతున్న నీటికి అడ్డుకట్టవేసి పంట కాలువలోకి మళ్లించారు. చొప్పెల్ల లాకుల వద్ద నుంచి వచ్చే కాలువ ద్వారా వేలాది ఎకరాలు సాగు చేయాల్సి ఉంది. కాలువ దిగువన ఉన్న భూములకు సాగునీరు అందక వస్తున్న ఇబ్బందులను గుర్తించిన రైతులు కాలువ పక్కనే ఉన్న నర్సిపూడి మిడియం డ్రైన్‌లో పంటభూముల్లో అదనంగా ఉన్న నీరు దిగువకు వెళ్లిపోతోంది. ఈ డ్రైన్‌కు గుమ్మిలేరు వద్ద అడ్డుకట్ట వేసి డ్రైన్‌లో ఉన్న నీటిని పంట కాలువలోకి మళ్లించడం ద్వారా గుమ్మిలేరుతో పాటు మండపేట, వల్లూరు గ్రామాల పరిధిలోని 600 ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోతున్నాయి. దీంతో రైతులు స్వచ్ఛందంగా నిధులు సమకూర్చుకుని ఇసుక, బరకాలు, కర్రలతో అడ్డుకట్ట వేసి పంటకాలువలోకి నీటిని మళ్లించారు. రైతు ప్రతినిధులు అముజూరి శ్రీనివాస్, యర్లగడ్డ రమేష్‌చౌదరి అడ్డుకట్ట పనులను పర్యవేక్షించడంలో కీలకపాత్ర పోషించారు.



గుమ్మిలేరులో నీటి కోసం అడ్డుకట్ట వేస్తున్న రైతులు



నంది విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

నంది విగ్రహం ప్రారంభం

ద్రాక్షారామ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరంలో నిర్మించిన నంది విగ్రహాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రారంభించారు.విగ్రహం ఆవిష్కరించి పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, గ్రామస్థులుపాల్గొన్నారు.



పెదపళ్లలోనున్న గణపతి

ఘనంగా సంకటహర చతుర్థి

ఆలమూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని పలు గణేష్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. పెదపళ్ల బాల గణపతి ఆలయంలో ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేకం, గరికపూజ తదితర పూజలు చేశారు. చింతలూరు గణేష్ ఆలయంలో సంకటహర గణపతి హోమం జరిపారు. ఆయా ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని పలువురు భక్తులు పూజలు చేశారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

కొత్తపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. వాడపాలెం గ్రామానికి చెందిన గొర్రె విజయ్‌కుమార్‌ను ఐదు లీటర్ల నాటుసారాతో, రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన దాసరి నాగబాబును పది లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసిన్నట్టు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.



సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సర్పంచ్‌లకు శిక్షణ

ఆత్రేయపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్, వెలుగు కార్యాలయాల్లో బుధవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ జరిపారు. ఈ శిక్షణలో ఎంపీడీవో వెంకటరామన్ అభివృద్ధి, పరిపాలన తదితర పలు అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన ఉద్యోగులు, సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందించారు.



తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కూలీలు

పనులు కల్పించాలని కూలీల నిరసన

ఆత్రేయపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్‌ల్లో పనులు కల్పించాలంటూ కూలీలు నిరసన తెలిపారు. బుధవారం తహశీల్దారు కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. ప్రస్తుతం ఆత్రేయపురం ఇసుక ర్యాంపులో తవ్వకాలు నిలిచిపోయాయి. కూలీలకు రోజూ పనులు కల్పించాలని తహశీల్దారు రాజేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందించారు. పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారించాలి

రాయవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2025-26పై రెండో రోజు శిక్షణ జరిగింది. ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన మాట్లాడుతూ సహజ వనరులను వినియోగించుకునేలా ప్రణాళికలు తయారుచేసి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్స్ డే వేడుకలు

మండపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాళం వారి సత్రంలో బుధవారం పెన్షనర్స్ డే వేడుకలు జరిపారు. పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ వేడుకల్లో 75 ఏళ్లు కలిగిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కార్యదర్శి పేంకే గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు



కె.గంగవరం మండలం యర్రపోతవరంలో ర్యాలీ చేస్తున్న తహశీల్దార్ మృత్యుంజయరావు, రెవెన్యూ సిబ్బంది

రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కపిలేశ్వరపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహశీల్దార్ పి.చిన్నారావు అన్నారు. బుధవారం మండలంలోని వెదురుమూడి, నల్లూరు పంచాయతీ కార్యాలయాల వద్ద జరిపిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జమ్మ, వీఆర్‌వోలు, రెవెన్యూ పంచాయతీ సిబ్బంది, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని పసలపూడి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిపారు. తహశీల్దారు ఐపీ శెట్టి మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో పలువురు రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు అన్నారు. బుధవారం మండలంలోని బాలాంత్రం, యర్రపోతవరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిపారు. యర్రపోత వరంలో రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ జరిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్రావు, రైతులు, ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.



రాయవరం మండలం పసలపూడి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం



అచ్యుతాపురం గ్రామసభలో పనుల వివరాలు తెలుపుతున్న డీఆర్పీ కోటయ్య

ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ

కపిలేశ్వరపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురం పంచాయతీ వద్ద బుధవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ జరిపారు. గ్రామ కార్యదర్శి దేవిప్రసన్న అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎస్ఆర్పీ కనకారావు పలు అంశాలను తెలిపారు. సభలో డీఆర్పీ కోటయ్య మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో సేకరించిన పనుల వివరాలు సభలో వినిపించారు. గ్రామసభలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రవికిరణ్, జేఈ పి.రజిత్‌సింగ్, టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్, మేట్లు, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మండల ఈవోపీఆర్డీ శ్రీనివాస్

ముగిసిన పంచాయతీ ఉద్యోగుల శిక్షణ

మండపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు పంచాయతీ సచివాలయ ఉద్యోగులకు జరిపిన శిక్షణ ముగిసింది. చివరి రోజు బుధవారం మండల పంచాయతీ విస్తరణ అధికారి దాసరి శ్రీనువాస్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో మండలస్థాయి అధికారులు, మండల పరిషత్ పరిపాలనాధికారి ప్రసాద్, పంచాయతీరాజ్ జేఈ వి.నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ చైతన్య, ఐసీడీఎస్ అధికారి తోపాటు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాజోలులో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఇంటర్ కాలేజీ ఎట్ స్థాయిలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. ఎస్.విజయరాజు 91 కిలోల విభాగంలో బంగారు పతకం, వి.వరసత్యప్రసాద్ 67 కిలోల విభాగం లో వెండి పతకం సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు పీడీ యువరాజును ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు, చినబాబు స్వర్ణలత, వరప్రసాద్ తదితరులు అభినందించారు.

కొత్తపేట: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ ఎట్ 2024-25 కిక్ బాక్సింగ్ ట్రైల్స్ పోటీల్లో కొత్తపేట విశ్వకవి వేమన డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. రాజోలులో 17, 18 తేదీల్లో నిర్వహించిన కిక్‌బాక్సింగ్ టోర్నమెంట్‌లో సీహెచ్ పృధ్వీరాజ్, కె.సతీష్ గోల్డ్‌మెడల్ సాధించగా ఎం.వంశీ, కె.అనిల్‌కుమార్, పి.లక్ష్మీనారాయణ సిల్వర్ మెడల్స్ సాధించారు. బీఆర్డీ సాయికుమార్, బి.ప్రభాష్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ కిక్ బాక్సింగ్ మెన్ టీమ్‌కు సీహెచ్ పృధ్వీరాజ్ ఎంపికయ్యాడు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, పీడీ డాక్టర్ కె.అంకంరావు, కె.కనకరాజు తదితరులు అభినందించారు.



కొత్తపేటలో విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, అధ్యాపకులు

విద్యుత్ పొదుపుతో లాభాలెన్నో...

ఆత్రేయపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ అశోక్ తెలిపారు. బుధవారం ఆత్రేయపురం మహాత్మాగాంధీ విద్యా సంస్థల్లో విద్యార్థులకు విద్యుత్‌ను ఎలా ఆదా చేసుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు జరిపారు. విజేతలకు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ పీఎస్ రాజు బహుమతులు అందించారు.

విద్యుత్ ఆదాపై అవగాహన

రావులపాలెం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ పాఠశాలలో ఇందన పొదుపు వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రాజబాబు సోలార్ విద్యుత్ వల్ల కలిగే లాభాలపై విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం ఈఈ ఎం.రవికుమార్, టెక్నికల్ ఈఈ వై.విజయానంద్, కొత్తపేట డీఈ చిట్టిరాజు, ఏఈ పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న మంత్రి సుభాష్

మంత్రి సుభాష్ ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రెండు కుటుంబాలకు మంత్రి సుభాష్ ఆర్థికసాయం అందించారు. రామచంద్రపురం మండలం కాపవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న వనుం లక్ష్మి కుటుంబానికి రూ.15 వేలను భర్త నాగేశ్వరరావుకు అందించారు. కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో పిడుగుపడి మృతి చెందిన నందికోళ్ల వీరాస్వామి భార్యకు రూ.20 వేలు ఆర్థిక సాయం మంత్రి అందించారు. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలున్న ఆమెకు మంత్రి ఆర్థిక సాయం అందించారు.

లఖ్‌పతి దీదీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లఖ్‌పతి దీదీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాయవరం యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ వి.సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం రాయవరం యూనియన్ బ్యాంక్‌లో రాయవరం, వి.సావరం. సోమేశ్వరం, లొల్ల గ్రామాల వీవోఏలతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పద్దెనిమిది ఏళ్ల నుంచి 50 ఏళ్లున్న స్వయం సహాయక సభ్యులకు పశు పోషణ, పుట్ట గొడుగుల పెంపకం ఎల్ఈడీ బల్బుల తయారీ తదితర యూనిట్లు నిర్వహించుకునేలా శిక్షణ అనంతరం రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకంపై వీవోఏలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కె.నాగేశ్వరరావు, సీసీ నాజర్ హుస్సేన్, వీవోఏలు పాల్గొన్నారు.